క్లుప్తంగా

బస్తీ దవాఖానా పనులను పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయికల్: పట్టణంలో ఈనెల 10లోపు బస్తీ దవాఖానా పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం బస్తీ దవాఖాన పనులను పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈ ప్రసాద్ ఉన్నారు.

ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి కొడిమ్యాల గ్రామానికి చెందిన నాంపల్లి నారాయణ–సరోజన దంపతుల కుమారుడు ఉద్యోగరీత్యా లండన్‌లో స్థిరపడిన మనోహర్–సుజిత శాశ్వత చందాదారులుగా రూ.25,016 విరాళంగా అందజేశారు.

ఉపాధి కూలీలకు వ్యవసాయంపై శిక్షణ


పెసర పంటను పరిశీలిస్తున్న అధికారులు, కూలీలు

కథలాపూర్: మండలకేంద్రంలోని రైతు వేదికలో వందరోజులు ఉపాధిహామీ పనులు పూర్తి చేసిన కూలీలకు సోమవారం వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కూలీల్లో నైపుణ్యం లేనివారిని గుర్తించి వారికి వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల గురించి శిక్షణ ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. అనంతరం పంట పొలాల వద్దకు కూలీలను తీసుకెళ్లి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎంపీడీవో జనార్దన్, ఏపీవో రాజేందర్, ఉన్నతి జిల్లా కోఆర్డినేటర్ రమేశ్, ఏఈవో ఫమీనా, టీఏ అంబాజీ, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం


ఉద్యోగులను సన్మానిస్తున్న మహిళలు

కథలాపూర్: మండలంలోని రాజారాం తండా గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముందస్తుగా మహిళా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, అరుణ, సర్పంచ్ సరిత, టీచర్ సుమలత, అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, వనిత, వరలక్ష్మి, రమ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు సోమవారం ఆలయంలో అర్చకులు చక్రపాణి నర్సింహమూర్తిచార్యులు శాంతి యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ సున్నం నవ్యశ్రీ, సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎడిపెల్లి గంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ నాంపెల్లి వెంకటాద్రి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కోటగిరి అశోక్, అర్చకులు మంత్రరాజం శ్రీనివాసచార్యులు, మంత్రరాజం జానకీరామకృష్ణచార్యులు, అరవిందకృష్ణచార్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగు గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మహిళలు, కిషోర బాలికలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దమ్మ భీమారెడ్డి, ఎంపీటీసీ జి.మాధురి, కార్యదర్శి శేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.చంద్రకళ, ఎ.మంజుల, విజయభారతి, కె.గంగజల, జి.సుమలత పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అనాసక్తి

- మండలంలో 35 ఎకరాల్లో మొక్కలు నాటిన వైనం
- ఫ్యాక్టరీ ఏర్పాటులో స్పష్టత కరువు
- సాగు, విక్రయాలపై అవగాహన లేకపోవడమే కారణమంటున్న రైతులు


పంపిణీ చేసేందుకు నర్సరీలో సిద్ధంగా ఉన్న ఆయిల్‌పామ్ మొక్కలు

కథలాపూర్: తక్కువ నీటి అవసరంతో సాగు చేసే పంటల్లో ఆయిల్‌పామ్ ఒక్కటి. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మొక్కలు, డ్రిప్ పరికరాలు సబ్సిడీపై అందిస్తోంది. అయినప్పటికీ సాగుపై, పంట విక్రయాలపై రైతుల్లో విభిన్న సందేహాలు నెలకొనడంతో కథలాపూర్ మండలంలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపడం లేదు. ఇప్పటివరకు మండలంలో 35 ఎకరాల్లో మాత్రమే మొక్కలు నాటడం ఇందుకు నిదర్శనం.

మండలంలో 210 ఎకరాల్లో సాగుకు దరఖాస్తులు..

మండలంలో 19 గ్రామాలున్నాయి. రైతులు ఎక్కువగా వరి, మొక్కజొన్న, పసుపు, పప్పుదినుసుల పంటలు సాగు చేస్తుంటారు. మార్కెట్లో ఆయిల్‌పామ్‌కు మంచి డిమాండ్ ఉండటంతో ప్రభుత్వం సాగు పెంచాలని, అందుకు సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందిస్తామని ప్రకటించింది. ఇందుకోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 210 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తామని 90 మంది రైతులు అప్పట్లో దరఖాస్తులు సమర్పించారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన లేకపోవడంతో ఏదైనా చీడ పురుగులు ఆశిస్తే ఏమి చేయాలో తెలియకపోతే ఆర్థికంగా నష్టపోయే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు.

ఫ్యాక్టరీ ఏర్పాటులో స్పష్టత కరువు..

ఆయిల్‌పామ్ సాగు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరినీ పంటల సందర్శనకు తీసుకెళ్లకపోవడంతో ముందడుగు వేయలేకపోతున్నట్లు రైతులు చెప్తున్నారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయంలో స్పష్టత లేదని రైతులు పేర్కొంటున్నారు. పంటకు ధర విషయంలో సందేహాలుండటంతో ఆయిల్‌పామ్ సాగుపై ఈ ఏడాది ఆసక్తి చూపించలేకపోతున్నామని మండలంలోని పలువురు రైతులు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆయిల్‌పామ్ సాగుపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తే సాగుపై ఆసక్తి చూపే అవకాశముందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

మద్దతు ధరపై స్పష్టత లేదు



ఆయిల్‌పామ్ సాగు చేయాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. పంట విక్రయించడానికి ఫ్యాక్టరీ ఏర్పాటు పై ఇప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదు. పంటలను దూర ప్రాంతంలో విక్రయించాలంటే రైతులకు ఇబ్బందే. మద్దతు ధరపై స్పష్టత లేకపోవడంతో పంట వేయలేదు. ధర, పంటల విక్రయాలపై ప్రభుత్వం రైతులకు నమ్మకం కలిగించాలి. – నరెడ్ల రవీందర్‌రెడ్డి, రైతు, దూలూర్

రైతులు వినియోగించుకోవాలి



ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తే రైతులకు లాభమే. ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికాలు అందిస్తోంది. ఎకరం పంట సాగు చేస్తే ప్రభుత్వం ఏడాదికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు మంజూరు చేస్తుంది. మంచి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
– రమేశ్, ఆయిల్‌పామ్ పంటల ఇన్‌చార్జి, కోరుట్ల

అటెన్షన్ ప్లీజ్



వాగు దాటడానికి తప్పని తిప్పలు

సారంగాపూర్: మండలంలోని మ్యాదారంతండా శివారు గిరిజన తండా తలుపుల తండాకు వెళ్లే దారిలో వాగుపై ఏర్పాటు చేసిన లోలెవల్ కాజ్‌వే ఆగస్టు–సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు వచ్చిన వరదల్లో కొట్టుకుపోయింది. రేచపల్లి క్రాసింగ్ నుంచి నేరుగా తలుపులతండాకు చేరుకోవడానికి ఇది అత్యవసర మార్గం. లోలెవల్ కాజ్‌వే కొట్టుకుపోయిన తర్వాత ప్రజలు వాగు దాటడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను ఇటీవల గ్రామస్తులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : భూపతి, పీఆర్ ఏఈ
ఫోన్ నంబర్: 91211 35727

సీఎం సహాయనిధితో ఆర్థిక భరోసా


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: సీఎం సహాయనిధితో నిరుపేదలకు ఆర్థిక భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు రూ.4,72,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కొడిమ్యాల: మండలానికి చెందిన 43 మంది లబ్ధిదారులకు రూ.14.41లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సోమవారం పంపిణీ చేశారు. లబ్ధిదారులు చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శోభ

పెగడపల్లి: గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శోభ, వైద్యాధికారి నరేశ్ ప్రజలను కోరారు. ఈ మేరకు పెగడపల్లి మండలంలోని ల్యాగలమర్రిలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. సర్పంచ్ వనజ, ఎంపీటీసీ అంజయ్య, నంచర్ల విండో చైర్మన్ వేణుగోపాల్, ఆర్బీఎస్ మండల చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ అంజి, క్యాంపు డాక్టర్ ఫర్హానా, ఆప్తమాల జిస్టు సంతోష్, వైద్య సిబ్బంది మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లి, మొగిలిపేట గ్రామాల్లో..

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి, మొగిలిపేట గ్రామాల్లో కంటివెలుగు పథకాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని, సర్పంచ్‌లు వనతడుపుల నాగరాజు, బిట్ల సరోజన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య బృందం గ్రామాల్లోకి వచ్చి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. కంటి వెలుగు పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కంటి వెలుగు ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ రాహుల్‌శర్మ, ఎంపీటీసీలు ఓస సత్తెమ్మ, గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, సామ రవి, హెల్త్ సూపర్‌వైజర్లు ఇందిర, శ్రీనివాస్, నాయకులు బిట్ల నరేశ్, ఓస రాజిరెడ్డి, గుగ్లావత్ రాజేందర్ పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో..

జగిత్యాలజోన్: జగిత్యాల మండలంలోని లక్ష్మీపూర్‌లో సోమవారం కంటి వెలుగు శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శిబిరాన్ని సర్పంచ్ చెరుకు జాన్ ప్రారంభించారు. టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎద్మల సత్యంరెడ్డి, నాయకులు రాజిరెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టిసారించాలి


మొక్క నాటుతున్న ఎంపీపీ శోభ

పెగడపల్లి: ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టిసారించాలని ఉద్యానవనశాఖ అధికారి అనిల్‌కుమార్, ఎంపీపీ శోభ, ఆర్బీఎస్ మండల చైర్మన్ నరేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని నామాపూర్ గ్రామంలో నునుగొప్పుల గంగమల్లు, రాములు అనే రైతు వ్యవసాయ భూముల్లో సోమవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. సర్పంచ్ ఇనుగండ్ల కరుణాకర్‌రెడ్డి, నంచర్ల విండో చైర్మన్ వేణుగోపాల్, ఉప సర్పంచ్ సంతోష్, ఏఈవో నవీద్, అశోక్ పాల్గొన్నారు.

రైతులకు అధిక లాభాలు

వెల్గటూర్: మండలంలోని పైడిపెల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం చేపట్టారు. పైడిపల్లి సర్పంచ్ గంగుల నగేష్‌కు చెందిన 4 ఎకరాల వ్యవసాయ భూమిలో త్రికోణ పద్ధతిలో 228 మొక్కలు నాటారు. ఏఈవో ఫిర్దోజ్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ గంగుల నగేష్, ఏఈవో అయ్యోరి వినోద్, ఫీల్డ్ ఆఫీసర్ రాహుల్, మండల రైతుబంధు సమితి మెంబర్ గంగుల నరేశ్ పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి


పాదయాత్రలో పాల్గొన్న నారాయణరెడ్డి

మల్లాపూర్: హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా సోమవారం చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, చెరుకు రైతులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి రైతాంగ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మామిడి నారాయణరెడ్డి మాట్లాడుతూ స్వరాష్ట్రంలో తమ జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్న కలలు గన్న రైతులు చక్కెర కర్మాగారాలు మూతపడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించడంతో పాటు ఏకకాలంతో రైతుల రుణాలను మాఫీ చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెరుకు రైతులు న్యావనంది లింబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి


సమావేశమైన గ్రంథాలయ కమిటీ సభ్యులు

కోరుట్ల: పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయాన్ని విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చెన్న విశ్వనాథం అన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి గ్రంథాలయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చెన్న విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలు, ఉద్యోగ సాధనకు కావాల్సిన పుస్తకాలు, అన్ని రకాల పత్రికలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుతారి రాములు, రాసభూమయ్య, రాడం అశోక్, రాచకొండ దేవయ్య, రాజు, ఒటారికారి శ్రీనివాస్, ఎండీ ముఖ్రం, చింత భూమేశ్వర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న మహిళలు

జగిత్యాలరూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూపరాణి అన్నారు. ఈ మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మోతె ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి మహిళా దినోత్సవ కార్యక్రమాల నిర్వహణ కొనసాగుతోందన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, సాంకేతిక రంగంలో ఎంతో పురోగతి సాధిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చురకంటి స్వప్న, ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణచైతన్య, వీవోఏ మమత, అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, శారద, సుమలత తదితరులు పాల్గొన్నారు.

సంగంపల్లిలో..

సంగంపల్లి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళ దినోత్సవం నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

గొల్లపల్లి: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన చిలుకమారి శ్రీహరి ఎడమకాలు తొలగించారు. చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని సోషల్ మీడియా ద్వారా సామాజిక సేవకులు చౌటపెల్లి తిరుపతి పోస్టు చేయగా దాతలు స్పందించారు. ముంబైకి చెందిన ఆసం ఆనంద్ తన బంధుమిత్రుల ద్వారా రూ.18,200, కర్రపాటి నరేశ్ రూ.5606 శ్రీహరి కుటుంబానికి అందజేశారు. అలాగే శ్రీహరి చికిత్స పొందుతున్న ఆసుపత్రిలో ముంబైకి చెందిన పుట్టపాక నరేశ్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి రూ.80వేలు బిల్లు తగ్గించారు. దాతలు స్పందించాలని వారు కోరారు. కార్యక్రమంలో చౌటపెల్లి రఘునందన్, అంకం రవి, అంకం సతీశ్, సామల వీరస్వామి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం


ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లిలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన శ్రీగద్దె ప్రకాశ్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిహారం త్వరగా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ స్వామి, ఉపసర్పంచ్ గణేశ్, డైరెక్టర్ మహేందర్, రాచర్ల రవి, బద్దం మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆వచ్చేఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదు

మెట్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి శేఖర్‌జీ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

◆రేపు మైనార్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

మల్యాల: మైనార్టీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికను 8వ తేదీన మల్యాల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేంకటేశం తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు.

మార్కెట్‌యార్డుకు రెండురోజులు సెలవు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుకు హోలీ సందర్భంగా మంగళ, బుధవారాలు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్మన్ నక్కల రాధ తెలిపారు. తిరిగి కొనుగోళ్లు గురువారం నుంచి కొనసాగుతాయని తెలిపారు.

◆పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

జగిత్యాల: పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని బీర్‌పూర్ నృసింహస్వామి ఆలయ మాజీ అధ్యక్షుడు గోనె ప్రదీప్‌రావు కోరారు. ఈ మేరకు జగిత్యాలలో విలేకరులతో మాట్లాడారు. పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు.

◆ముందస్తుగా మహిళా దినోత్సవం

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ముందస్తుగా మహిళా దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ స్వప్న, అంగన్‌వాడీ కార్యకర్తలు వనిత, పద్మ పాల్గొన్నారు.

◆ఇంటింటా భగవద్గీత పంపిణీ

జగిత్యాలరూరల్: త్రైత సిద్ధాంతం హిందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్‌లో ఇంటింటా భగవద్గీత పంపిణీ చేశారు.

◆ఉపాధి కూలీలకు పని కల్పించాలి

మల్లాపూర్: ఉపాధికూలీలకు పనిదినాలు కల్పించాలని సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని సిరిపూర్‌లో ఉపాధి పథకం కింద చేపట్టిన కందకాల పనులు పరిశీలించారు. ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, వార్డుసభ్యులు గంగలక్ష్మి, సంజీవ్‌గౌడ్, మహేశ్, నాగార్జునరెడ్డి, శృతి, కిషోర్, లావణ్య, రాజు పాల్గొన్నారు.

◆పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

మల్లాపూర్: పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని సర్పంచ్ బొడ్డు సుమలత అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని సాతారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు ఆమె హ్యాండ్‌గ్లౌజులు, సబ్బులు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

◆నియామకం

మెట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్లుగా గోనెల రాజేశ్, మిట్టపల్లి భూమేశ్‌ను నియమించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను సోమవారం పార్టీ నాయకులు జువ్వాడి నర్సింగరావు వారికి అందజేశారు. నాయకులు జువ్వాడి కృష్ణారావు, అల్లూరి మహేందర్‌రెడ్డి, ఎలాల జలపతిరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక సోమవారం పరీక్ష సామగ్రి అందజేశారు. విద్యార్థులందరికీ ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. జిల్లా గంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు శ్రీరాం కిషన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు హోలీ సంబరాలు


కట్కాపూర్‌లో హోలీ వేడుకల్లో విద్యార్థులు


కథలాపూర్: భూషణరావుపేట పాఠశాలలో..

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ముందస్తుగా హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

కథలాపూర్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం ముందస్తుగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హోలీ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్


సైన్స్‌ఫెయిర్‌లో ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారు. ఈ సైన్స్‌ఫెయిర్‌ను ఆర్డీవో వినోద్ కుమార్ సందర్శించి విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కేరళ హైస్కూల్ కరస్పాండెంట్ ఎంఏ భారీ, ప్రిన్సిపాల్ సెలీనా బారీ, పీఆర్‌బీఎం కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ పాల్గొన్నారు.